# ఆకట్టుకున్న వన మహోత్సవం



మాద్వార్‌లో మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం వెంకట్‌రాములు

**నారాయణపేట రూరల్:** ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని పంచాయతీ కార్యదర్శి భానుచందర్ అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్‌లో సోమవారం 75వ వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రహదారికి ఇరువైపులా, జీపీ బిల్డింగ్ తదితర చోట్ల మొక్కలు నాటారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. వివిధ రకాలైన కూరగాయలు, పండ్ల మొక్కలు అందించి పిల్లలతో నాటించారు. అదేవిధంగా స్థలం ఉన్న ప్రతిఒక్కరికీ ఇంటింటికీ తిరుగుతూ మొక్కలు పంపిణీ చేశారు. మొక్కలు నాటడంతో కలిగే లాభాలను వివరించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందడటమే కాకుండా సకాలంలో వర్షం కుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీచర్ సంధ్య, ఎఫ్ఏ భాగ్యమ్మ, సునీత, బాలకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

**మక్తల్:** మండలంలోని మాద్వార్ గ్రామంలో సోమవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఎచ్ ఎం వెంకట్‌రాములు ప్రారంభించారు, అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్క నాటి పెంచాలని కోరారు. ఉపాధ్యాయులు రామాంజనేయులు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్లు శ్రీనివాసులు, తిమ్మయ్య పాల్గొన్నారు.

**నాటిన మొక్కలు సంరక్షించాలి**

**కోస్గి:** మండలంలోని మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఒక్కో విద్యార్థికి రెండు మొక్కలు పంపిణీ చేయగా, పాఠశాల ఆవరణలో ఒకేరోజు నాటి ఆకట్టుకున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం వెంకట్రామ్‌రెడ్డి, ఎఫ్ఏ నర్సింహ, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

**మొక్కలు నాటిన యువకులు**

**మరికల్:** ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రంలో కొందరు యువకులు అమ్మ పేరుతో పలు కూడళ్లలో మొక్కలు నాటారు. నాటిన మొక్కలను కాపాడుకుంటామని తెలియజేశారు. తమలా ప్రతిఒక్కరూ అమ్మ పేరుతో మొక్కలు నాటి పర్యావరణం కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాస్కర్, యూసూఫ్, రఘు, రాము పాల్గొన్నారు.

**మొక్కలు నాటిన చైర్‌పర్సన్**

**నారాయణపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో సోమవారం జిల్లా కేంద్రంలోని న్యూ సునంద హాస్పిటల్, యాద్గిర్ రోడ్డు, మున్సిపల్ ఖాళీ స్థలంలో నారాయణపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, కౌన్సిలర్లు మహేష్ సలీం కతలప్ప, కాంగ్రెస్ నాయకులు మనోజ్, బండి ఆనంద్, పవన్, రాము, గడ్డం వినోద్, అనసుద్దీన్ పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

## ఒక్క సీసీకెమెరా వంద మందితో సమానం



మంతనోగోడ్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ లింగయ్య

- డీఎస్పీ లింగయ్య

**మక్తల్:** ఒక్క సీసీ కెమెరాను ఏర్పాటు చేస్తే వంద మంది పోలీసులతో సమానమని నారాయణపేట డీఎస్పీ లింగయ్య అన్నారు. సోమవారం మక్తల్ మండలం మంతన్‌గోడ్‌లో రాత్రి 8 గంటలకు గ్రామస్తుల సహకారంతో 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అదుపులోకి వస్తాయని, ఒకవేలా దొంగతనాలు జరిగితే సీసీ కెమెరాల నుంచి గుర్తు పట్టవచ్చని అన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రధాన కూడలి దగ్గర సీసీ కెమెరాలను ఏర్పాటు చేందుకు దాతలు ముందు రావాలని కోరారు. మంతన గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోని మిగతా గ్రామాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసులు నిరంతరంగా ప్రజల రక్షణ కోసం కృషి చేస్తున్నారని, అందరు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాలు 24 గంటలు పని చేస్తున్నాయని, ప్రజలకు రక్షణగా ఉంటాయన్నారు. గ్రామం కోసం గ్రామస్తులు సహకారం చేయడంతో ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ విలేజ్ పోలీస్ అశోక్‌కుమార్‌ను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వర్షానికి కూలిన మట్టి ఇల్లు



**ఊట్కూరు:** మండల కేంద్రంలోని పాతపేట వీధిలో సోమవారం కురుస్తున్న ముసురు వర్షానికి నజలాపురం నర్సింహ మట్టి ఇల్లు పై కప్పు కూలింది. దీంతో నిత్యావసర వస్తువులు, దుస్తులు మట్టిలో కలిసిపోయాయి. కుటుంబ సభ్యులు ఇంటి బయట ఉండడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. మట్టి ఇల్లు కూలడంతో సుమారు రూ.30 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## రెండు ఎద్దుల అపహరణ

**మాగనూర్:** మండల కేంద్రానికి చెందిన రైతు గడ్డం వెంకటయ్యకు చెందిన రెండు ఎద్దులను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అపహరించిన ఘటన చోటుచేసుకుంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రైతు గడ్డం వెంకటయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సా యంత్రం 6 గంటల ప్రాంతంలో పొలం దగ్గర రోజు మాదిరి గానే ఎద్దులను కట్టేసి ఇంటికి వచ్చా డు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా రెండు ఎద్దులు కనిపించలేదు. అతను ఇంటి దగ్గర ఉన్న సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఎద్దులను దొంగిలించారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచి అమలు చేయాలి

- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన అంగన్‌వాడి టీచర్లు

**మక్తల్:** అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను పెంచి తమ సమస్యలు పరిష్కారం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఇంటిని ముట్టడించారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలమం వద్ద అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వర్షంలో గొడుగులు పట్టుకోని క్యాంపు కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం ఎమ్మెల్యేకి జిల్లా గౌరవ అధ్యక్షుడు జి.వెంకట్‌రాంరెడ్డి, జిల్లా కో కన్వీనర్ గోవిందురాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు సి.ఆంజనేయులు, సహాయ కార్యదర్శి గోవిందురాజ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు 30, 40 ఏళ్ల నుంచి పని చేస్తున్నారన్నారు. టీచర్లకు రిటైర్మెంట్ అయితే 2లక్షలు, హెల్పర్‌కు 1లక్ష రూపాయాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడి టీచర్లకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, పెన్షన్, ప్రమాద బీమా తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు మంజుల, ప్రాజెక్టు అధ్యక్షురాలు విజయలక్ష్మి, రాధిక, రామేశ్వరి, బాగ్యలక్ష్మి, బాగ్యమ్మ, మల్లమ్మ, శోభ, మల్లమ్మ, గిరిజ, జమున, నరేష్, శంకర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు వర్షంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

## వృత్తి విద్యా కోర్సుల్లో రాణించాలి

**దామరగిద్ద:** వరల్డ్ స్కిల్ డే సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వృత్తివిద్యా విభాగం ఉపాధ్యాయులు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జీహెచ్ ఎం అశోక్ చేతుల మీదుగా బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎం మాట్లాడారు. నేటి విద్యావిధానంతో సృజనాత్మకతకు ప్రాధాన్యత ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సుల్లోనే రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వృత్తివిద్యా ఉపాధ్యాయులు శంభులింగం, అనురాధ, శిరీష విద్యార్థులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చాలి

**నారాయణపేట:** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నారాయణపేట సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రాష్ట్రంలోని ముదిరాజ్ లను బీసీ డీ నుంచి బీసీ ఏ కు మార్చాలని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సరఫ్ నాగరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారంభవి శివాలయంలో పూజలు చేసి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యర్యంలో ముదిరాజ్‌లు బీసీ డీ నుంచి ఏ మార్చాలి అంటూ నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ పట్టణంలో ఛౌక్ బజారు, మొచ్చివాడ పాత బస్టాండ్ నుంచి ఆర్‌డీఓ కార్యాలయం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.వేయి కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని, జిల్లా కేంద్రంలో ముదిరాజ్ భవనానికి స్థలం కేటాంచి నిధులు మంజూరు చేయాలని, 60లక్షల జనాభాలో ముదిరాజ్‌ల నుంచి ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యే వాకిటి శ్రీ హరికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డీఓ కార్యలయం ఏఓ వెంకటేష్ కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఫ్రీషరీ చేర్మెన్ కాంతు కుమార్, యువత అధ్యక్షుడు ఆపిరెడ్డిపల్లి రాము, నాయకులు హన్మంతు, లక్ష్మీకాంత్, ఓం ప్రకాష్, వెంకట్రాములు, కాకర్ల బిమ్మయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

## ఎన్‌సీసీకి విద్యార్థుల ఎంపిక

**నారాయణపేట రూరల్:** పట్టణంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులను ఎన్‌సీసీకి ఎంపిక చేశారు. మిలటరీ అధికారులు కమల్‌కిషోర్, రంజిత్‌సింగ్ హాజరై వివిధ రకాలైన శారీరక పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా వివిధ రకాలైన ప్రశ్నలు వేసి దాదాపు 400మందికి పైగా విద్యార్థులను పరీక్షించారు. మొదటి విడతలో 40 మంది బాలికలు, 25 మంది బాలురను ఎంపిక చేశారు. మొత్తం వంద మందికిగాను రెండో విడతతో మరో 35 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం వేణుగోపాల్, పీఈటీ అక్తర్‌పాషా పాల్గొన్నారు.

## వేధింపులకు గురైతే షీటీమ్స్ సహకారం తీసుకోవాలి

**నారాయణపేట రూరల్:** ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కార్యాలయాల్లో ఎవరైన మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే వెంటనే షీటీమ్స్ సహకారం తీసుకోవాలని కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అమ్మాయిలను వేధిస్తే కఠిన శిక్షలు ఉంటాయని, అందుకు సంబంధించిన చట్టాలను ప్రతి అమ్మాయి తెలుసుకోవాలన్నారు. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్గి ఉండాలని సూచించారు. పని ప్రదేశాల్లో మహిళలు, విద్యాలయాల్లో బాలికలతో ఎవరైన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్ లైన్ నెంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. నిత్యం యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో షీటీమ్ బృందం ఉన్నారు.

## ఆత్మీయ సమ్మేళనం

**దామరగిద్ద:** మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2007–08 సంవత్సరం పదో తరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గుండయ్య, వెంకటప్ప మాట్లాడారు. 16 ఏళ్ల కిందట తాము చదువు చెప్పిన విద్యార్థులు గొప్పవారై వివిధ రంగాల్లో స్థిరపడటం ఆనందంగా ఉందన్నారు. చాలా రోజులకు కలిసిన పూర్వ విద్యార్థులతో మాట్లాడి అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులకు శాలువా పూలదండలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధికారులు నిర్లక్ష్యం వీడాలి

**నారాయణపేట రూరల్:** ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహించడం సరికాదని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సలీం, సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కుర్మయ్య సోమవారం వేర్వేరు ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ విషయంలో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఉచిత విద్యుత్ పథకం అమలుకు అర్హులైన వారి దరఖాస్తులను పక్కకు పెట్టి లబ్ధి జరగకుండా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ.. వారి సహనానికి పరీక్ష పెడుతున్నారని, అధికారుల వద్దకు వెళ్లగా.. సరియైన సమాధానం ఇవ్వడంలేదన్నారు.

## క్లుప్తంగా

### ఉపాధ్యాయులకు సన్మానం



**కోస్గి:** పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను, పదోన్నతిపై వచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులతో తమకున్న అనుబంధాన్ని విద్యార్థులు మరోమారు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్‌ఎం వెంకటేశ్వరి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

### ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి

**మద్దూరు:** ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మద్దూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ బిడ్డ వాకిటి శ్రీహరికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు వంచర్లగోపాల్, నెల్లి రాములు, సాయిలు, ఆశప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలకు టీవీ బహూకరణ

**ధన్వాడ:** మండల కేంద్రంలోని ఎస్సీవాడలో ఎంపీయూపీఎస్ పాఠశాలలో మ్యాథ్స్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన విజయమ్మ బదిలీపై వెళ్తుంది. ఈ క్రమంలో ఉపాధ్యాయురాలు విద్యార్థుల సౌకర్యార్థం 42 ఇంచుల స్మార్ట్ టీవీని ఆమె మామ ఉసునర్సప్ప జ్ఞాపకార్థం అందజేశారు. సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించగా.. పాఠశాలకు టీవీని అందజేశారు.

### ముందస్తు నాయకుల అరెస్ట్



**మద్దూరు:** నిరుద్యోగులు హైదరాబాద్‌లో చేపట్టిన చలో సచివాలయం కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు సోమవారం బీఆర్ఎస్, బీజేపీ నాయకులను, నిరుద్యోగులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో నర్సింహ, కృష్ణారెడ్డి, భరత్, రఘు, భరత్, తదితరులు ఉన్నారు.

**నర్వ:** ఉద్యమం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం తగదని బీఆర్ఎస్వీ మండల నాయకులు డీకే జనార్దన్ అన్నారు. అక్రమ నిర్బంధాలు, అరెస్టులు, విద్యార్థి ఉద్యమాలను ఆపలేరన్నారు.

**మక్తల్:** నిరుద్యోగుల శాంతియుత సచివాలయం ముట్టడికి వెళ్తున్న బీజేపీ బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఉద్యమిస్తే అరెస్టులు చేయడం సరికాదన్నారు. అరెస్ట్ అయిన వారిలో నర్సింహ, పూల శ్రీను, కుర్వలింగం, రాజుగౌడ్ ఉన్నారు.

### ముమ్మరంగా వరినాట్లు



**మాగనూర్:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు ట్రాక్టర్లతో పొలాలను దున్నిస్తుండగా, మరికొందరు వరి నాట్లు వేస్తున్నారు. వ్యవసాయ పనులో సందడి నెలకొంది. మండలంలో 9వేల ఎకరాల వరకు వరి సాగు చేస్తారని అంచనా వేస్తున్నారు. తొలకరి వర్షాలతో ఆరుతడి పంటలో ఎక్కువ శాతం రైతులు పత్తి పంటకే ప్రధాన్యం ఇచ్చారు. పంటల సాగు విషయంలో, రసాయన మందుల పిచ్చికారీ విషయంలో రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులను అడిగి సందేహాలు నివృత్తి చేసుకోవాలని సంబంధిత వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

### ఉచిత నేత్ర వైద్యశిబిరం



**కోస్గి:** జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, లయన్స్ క్లబ్ కోస్గి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో సోమవారం నిర్వహించిన ఈ శిబిరంలో నేత్ర వైద్యుడు భాస్కర్‌గౌడ్ 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 35 మందికి కంటిలో శుక్లాలు గుర్తించారు. కంటి శుక్లాలు ఉన్న వారికి పాలమూర్ జిల్లా కేంద్రంలోని లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. ఇందులో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బెజ్జు వెంకట్రాములు, ప్రతినిధులు వెన్న శేఖర్, పూర్ణచందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీతో రైతుల కళ్లల్లో ఆనందం చూస్తాం



భూత్పూరు రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**నర్వ:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని త్వరలో అమలు చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. నర్వ మండల రైతుల అభ్యర్థన మేరకు సోమవారం భూత్పూరు రిజర్వాయర్ నుంచి సాగునీటిని ఆయన నాయకులు, రైతులతో కలిసి విడుదల చేశారు. సందర్భంగా భూత్పూరు ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించి, అనంతరం నీటిని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ వర్షాకాలం నియోజకవర్గంలోని రిజర్వాయర్‌ల పరివాహక ప్రాంతాలలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అనేక సాగునీటి ప్రాజెక్టులు నేడు రైతులకు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నాటి నుంచి నేటి వరకు రైతుల పక్షన నిలిచిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ, నర్వ మండల కాంగ్రెస్ నాయకులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, గడ్డంపల్లి హన్మంతు, చంద్రకాంత్‌గౌడ్, చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నీరజ్, శరణప్ప పాల్గొన్నారు.

**హామీలు అమలు చేయడమే నా కర్తవ్యం**

**నర్వ:** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయడమే నా ప్రధాన కర్తవ్యమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం నాగిరెడ్డిపల్లి గ్రామంలో విద్యార్థుల, ప్రజల రవాణా ఇబ్బందులు తీర్చేందుకు ఆత్మకూర్, రాయికోడ్ ఆర్టీసీ బస్సును ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌లను శాలువాలు, పూలమాలలతో సత్కరించి, బస్సును ఎమ్మెల్యే స్వయంగా నడుపుకుంటూ యాంకి గ్రామం వరకు చేరుకున్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాగిరెడ్డిపల్లి, యాంకి గ్రామాల్లో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా విద్యార్థులు, ఆయా గ్రామాల ప్రజలు ఆత్మకూర్‌కు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బస్సు ద్వారా యాంకి, నాగిరెడ్డిపల్లి, నాగల్‌కడ్మూర్, నర్వ, పాథర్చేడ్, రాజుపల్లి, రాయికోడ్ గ్రామాలకు బస్సు సౌకర్యంతో ప్రజా రవాణ మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షులు చెన్నయ్యసాగర్, పోలీస్ జగన్‌మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, నీరజ్, చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి, గడ్డంపల్లి హన్మంతు, చంద్రకాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



నాగిరెడ్డిపల్లి వద్ద బస్సును ప్రారంభించి డ్రైవర్, కండక్టర్‌లను సత్కరించిన ఎమ్మెల్యే

## చౌకధర దుకాణం ప్రారంభం



చౌకధర దుకాణం ప్రారంభిస్తున్న నాయకులు

**మాగనూర్:** మండలంలోని పెగడబండ గ్రామ ప్రజలు చౌకధర దుకాణం లేక ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శివరాంరెడ్డి అన్నారు. సోమవారం పెగడబండ గ్రామంలో సబ్ చౌకధర దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల ఎన్నో సంవత్సరాల కల మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో సహకారమైందన్నారు. గ్రామానికి ప్రధాన సమస్య బీటీ రోడ్డును ఎమ్మెల్యే దృష్టికి ఇప్పటికే తీసుకువెళ్లడం జరిగిందని, అతి త్వరలోనే అది కూడా నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ నర్సిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నరసింహరెడ్డి, రామకృష్ణరెడ్డి, గ్రామస్తులు బుచ్చయ్యశెట్టి, సురేష్, శ్రీధర్‌రెడ్డి, డీలర్ లింగారెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు.

## ప్రమాదంపై ప్రచారం.. స్పందించిన పోలీస్

**మరికల్:** వర్షాలకు గుంతలుగా మారిన నారాయణపేట రోడ్డుపై వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారని, మరమ్మతు చేయాలని చంద్రశేఖర్ అనే వ్యక్తి సోషల్ మీడియలో పెట్టాడు. ఫోన్‌లో చూసి స్పందించిన పోలీస్ సిబ్బంది అక్కడ ప్రమాదాలు చోటుచేసుకోకుండా గుంతలు పడిన రోడ్డు వద్ద బారికేడు ఏర్పాటు చేయించారు. గుంతల రోడ్డును ప్రయాణికులు గమనించాలని సోషల్ మీడియలో ప్రచారం చేసిన చంద్రశేఖర్ ప్రయత్నానికి గంట వ్యవధిలోనే పోలీసుల నుంచి స్పందన వచ్చింది.




గంట వ్యవధిలోనే గుంతల రోడ్డు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడు

## ఘనంగా మొహర్రం వేడుకలు

- నేటిరాత్రి హసేన్, హుసేన్‌ల సవారి
- కందూర్‌లతో మొక్కుబడులు తీర్చుకుంటున్న భక్తులు
- బందోబస్తును పరివేక్షించిన డీఎస్పీ



ఊట్కూర్‌లో హసేన్-హుసేన్ పీర్లు

**సాక్షి నెట్‌వర్క్ :** మతసామరస్యానికి ప్రతీకైన మొహర్రం వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఊట్కూర్‌లో హసేన్, హుసేన్ పీర్ల సవారిలు నిర్వహిస్తున్నారు. మంగళవారం నవమి రాత్రి సవారి, బుధవారం దశమి సవారి చేస్తారు. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పెద్ద పీర్లను దర్శించుకొని మొక్కుబడులను తీర్చుకుంటారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు మేకలు, గొర్రెలతో ప్రత్యేక వంటకాలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కుబడులను తీర్చుకోవడం ఆనవాయితి. ట్రాక్టర్లు, ఆటో, ఎద్దుల బండ్లలో వచ్చిన భక్తులను గ్రామ శివారులోని షాదీఖాన దగ్గర గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా నీటి కులాయిలు ఏర్పాటు చేయడంతో భక్తులు అక్కడే విడిది ఏర్పాటు చేసుకొని వంటవార్పు పనులను చేపట్టానున్నారు. బుధవారం తెల్లవారు జామున 4 గంటల నుంచి హసేన్, హుసేన్ పెద్దపీర్లను గ్రామంలో ఊరేగిస్తూ ఉదయం 9 గంటల వరకు ఆసుర్‌ఖాన కు చేరుకుంటాయి. సాయంత్రం 5 గంటల నుంచి పీర్లను గ్రామంలో ఊరేగిస్తూ రాత్రి 10గంటల ప్రాతంలో పెద్దచెరువు అలుగుపై నిమజ్జనం చేస్తారు. ఈ వేడుకల్లో ముంబాయి, పూణె, సొలాపూర్, బెంగళూర్, హైదరాబాద్ తదితర పట్టాణాల నుండి భక్తులు హాజరవుతారు. మొహర్రం వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ లింగయ్య గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**చిరు దుఖాకాల ఏర్పాటు..**

మొహర్రం వేడుకల్లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన చిరువ్యాపారస్తులు గ్రౌండ్‌లో దుఖాకాలు ఏర్పాటు చేశారు. గాజులు, రంగుల రాట్నం, లేడిస్ కార్నర్, ఆటవస్తువులు, మిఠాయి, హోటల్లు, దుఖాకాలను చిరువ్యాపారస్తులు ఏర్పాటు చేశారు.

**డోలారోహణం ప్రత్యేకత..**

మొహర్రం వేడుకల్లో డోలారోహణ కార్యక్రమం ప్రత్యేకత నెలకొంది. దేవి నగర్‌లో డోలారోహణం కార్యక్రమం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోని ఆరె కటికె కులానికి చెందిన మగ శిశువును ఊయలో వేయగా హసేన్ ఊసేన్ పీర్లు శోభయాత్రలో భాగంగా అక్కడికి వచ్చి ఊయలను ఊపి నామకరణం చేపట్టడం అనాదిగా వస్తుంది. డోలారోహణ కార్యక్రమం తిలకించేందుకు వేలాదిమంది భక్తులు హాజరవుతారు.

## అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

**నారాయణపేట:** విధి నిర్వహణలో అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఆర్డీఓ మధుమోహన్ అన్నారు. సోమవారం జిల్లా కోశాధికారి యాదగిరి బదిలీ సందర్భంగా నూతనంగా వచ్చిన కోశాధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో వీడ్కోలు పలుకుతూ.. పలువురు యాదగిరికి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడారు. డీటీఓగా పనిచేసిన సందర్భంలో తనకు సహకరించిన సిబ్బందికి, ఉద్యోగస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ రషీద్, బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణమాచారి, అబ్దుల్ ఖలీల్, జె.రాజకుమార్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు సంతోష్ కుమార్, జయతీర్థ తదితరులు పాల్గొన్నారు.

## విరిగిన చెట్టు, విద్యుత్ స్తంభం

**దామరగిద్ద:** మండల కేంద్రంలోని 10వ వార్డు శివాజీ నగర్ వీధిలోని పోచమ్మ దేవాలయం సమీపంలో ఆదివారం తుమ్మ చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ స్తంభం విరిగిపడింది. విరిగి పడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ విషయమైన స్థానిన లైన్ మెన్ నీలకంఠరెడ్డిని వివరణ కోరగా.. వర్షానికి చెట్టు విరిగి వైర్లపై పడటంతో స్తంభం విరిగి పడిందన్నారు. విద్యుత్‌లైన్ కేవలం ఆలయం వరకు మాత్రమే ఉందన్నారు. మంగళవారం విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించనున్నట్లు చెప్పారు.

